# కార్పొరేటు పాఠశాలల్లో సిబ్బంది సమస్యలు

www.freegurukul.org
(Values, Skill Based Education In Digital)

https://t.me/helpfulinfo



డా.పోలం సైదులు

మూడునెలల ముందు నుండే కార్పొరేటు పాఠశాలల్లో అడ్మిషన్స్ పర్వం మొదలైంది. అందులో పనిచేసే సిబ్బందికి నెలసరి టార్గెట్స్ విధించి, ఒంటిపూట బడులు ప్రారంభమైనా మధ్యాహ్నం సైతం సిబ్బందిని రప్పించి, వచ్చే విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ప్రచార కార్యక్రమాలు చేయించారు. బతుకుదెరువు కోసం చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ, తమ కుటుంబాలను నడుపుకుంటున్న ఉపాధ్యాయులు యాజమాన్యం విధించే టార్గెట్స్ పూర్తిచేయలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారనడంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదు. ఇదంతా ప్రతిసంవత్సరం జరిగే తంతే అయినా కార్పొరేటు పోకడకు కళ్లెం వేసే నాథుడే కరువయ్యాడు. ప్రతి పాఠశాలలో 25 శాతం విద్యార్థులకు ఉచితంగా బోధిస్తున్నారా? విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు లాబ్స్, గ్రంథాలయం, బాత్ రూమ్స్, ఫ్యాన్స్, లైట్స్, బెంచీలు, బోధన వస్తువులు అన్నీ సక్రమంగానే ఉన్నాయా? శిక్షణ పొందిన సిబ్బందే పాఠాలు బోధిస్తున్నారా? వారి ఫీజుల వివరాలు ఎలా ఉన్నాయి? వసూలు చేస్తున్న ఫీజులు ఎంత? వారి వ్యయమెంత? సిబ్బంది వేతనాల వివరాలేంటి? అనే విషయాలను బహిర్గతం చేసినప్పుడే నిస్వార్థంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నా కానీ వీటి గురించి పట్టించుకునేవారే లేకుండా పోయారు.

నేడు యావత్తు దేశంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తోంది. ఉద్యోగాల కల్పన ఊసే లేదు. కేవలం ఎన్నికల హడావుడి మాత్రం నిరంతరం కొన సాగుతూ ఉంటుంది. రాజకీయ పక్షాలు ఒకరిపై ఒకరు నిందలు మోపుకుంటూ, అవసరాలకొద్దీ పార్టీలు మారుతూ, తమకు, తమ కుటుంబాలకు మనుగడను శాశ్వతపరుచుకుంటూ ఓటర్లను కల్లబొల్లి కబుర్లతో, మాయమాటలు చెప్పి, గారడీ చేస్తూ మభ్యపెడుతూ రాజకీయాలు చేస్తున్నారే తప్పా దేశంలో కోట్లలో యువత నిరుద్యోగ సమస్యతో విలవిలలాడుతుంటే, ఆ సమస్యకు పరిష్కారమార్గం చూపలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంపై అసహనం వ్యక్తపరుస్తూ, ఈ సమస్యలకు కారణం వారేనంటూ సమస్యను దాటవేస్తున్నారు. నిరుద్యోగులు సైతం, అందులో ఉపాధ్యాయ శిక్షణ పొంది, ప్రభుత్వ ఉద్యోగాలకు నోచుకోక తమ ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టి, కార్పొరేటు పాఠశాలలలో పనిచేసుకుంటూ, తమ కుటుంబాన్ని అరకొర సౌకర్యాలతో నెట్టుకువస్తున్నారు. వీరి ఆర్థిక పరిస్థితులను ఆసరాగా తీసుకొని, విచ్చలవిడిగా వాడుకుంటూ ప్రయివేటు విద్యాసంస్థలు వీరి శ్రమతో వ్యాపారం చేస్తున్నాయి.

ఉపాధ్యాయులంటే సమాజంలో భావిభారత నిర్మాతలను తయారుచేసేవారు, సమాజాన్నీ సక్రమమైన మార్గంలో నడిపే మార్గదర్శకులు. అలాంటివారికి ఆనాడు ఎంతో గౌరవస్థానముండేది. నేడు ఒక ప్రభుత్వ ఉపాధ్యాయునికిచ్చే నెలసరి జీతంతో పది మందికి పైగా ప్రయివేటు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. సమాజంలో ప్రైవేటు పాఠశాలలు పుట్టగొడుగుల్లా వెలసి, చిత్ర విచిత్ర వేషాలతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ పూటగడుపుతున్నాయి.



తరగతి గదిలో 30 మంది విద్యార్థులున్నా, వారి జ్ఞానానికనుగుణంగా ప్రవేశం కల్పించకుండా, తల్లిదండ్రుల సలహా మేరకు పైతరగతులు చదివిస్తూ, ఎలాంటి జ్ఞానంలేని వారీగా తయారు చేస్తున్నారు. తీరా ఈ విషయాన్ని ఎవరన్నా తెరమీదకు తెస్తే, ఆ తప్పును ఉపాధ్యాయునిపై నెట్టడం, వారి ముందే అసభ్యకరంగా మాట్లాడటమనేది దేనికి నిదర్శనమో.

ప్రైవేటు యాజమాన్యాలన్నీ ఒక సంఘంగా ఏర్పడి, ఏ పాఠశాలలోనైనా ఉపాధ్యాయుడు ఎదురుతిరిగితే, అతనిని తొలిగించి మరే పాఠశాలలో అవకాశం రాకుండా చేయగలుగుతున్నారు. వీరి వ్యాపారంలో సైతం అవసరానికి తగినట్టుగా నడుచుకుంటూ, ఉపాధ్యాయుల ఎంపిక విషయంలో కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవడం చూస్తే ఆశ్చర్యమేయకమానదు. ఉన్నతమైన చదువు చదివినవారు వీరికి అవసరం లేదు. వారి ఆర్థిక పరిస్థితి వీరిపైనే అదరపడేటట్లుండా లి. కష్టపడి పనిచేస్తూ, వారికీ ఎదురు తిరగకుండా, వారి కనుసైగలలో మెదులుతూ ఉండాలి. అకాడమిక్ ఎలా నిర్వర్తించినా బయటికి మాత్రం ఏదో అద్భుతంగా, ఆదర్శవంతంగా ఉంటున్నట్టు జాగ్రత్తలు తీసుకోవాలి. ఉపాధ్యాయులందరూ సమైక్యంగా ఉండొద్దు. పాఠశాలలో ఒకరికొకరు మాట్లాడటానికి వీలు లేకుండా జాగ్రత్త పడతారు. విద్యార్థులను ఏమి అనకూడదు, చదువు మాత్రం రావాలి. ఇదంతా అనవసరం ఇప్పుడున్న అన్నీ ప్రైవేటు విద్యాసంస్థలలో విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతున్నారా? ఉపాధ్యాయులకు గౌరవం ఇస్తున్నారా? అంటే సమాధానం లేని ప్రశ్నగానే మిగిలిపోతుంది.

విద్యార్థుల తల్లిదండ్రులు సైతం వారి పిల్లల అల్లరిని ఇంట్లో తట్టుకోలేక, వారికీ కావాల్సినవి సమకూర్చి ఉదయం 8 గంటలకు పాఠశాలలో వదిలి వెళ్లిపోతే, సాయంత్రం 6 గంటలకు వచ్చి తీసుకెళ్లడం, ఆ తర్వాత రెండు గంటల పాటు ట్యూషన్‌కు పంపడం, ఏదో రాత్రి 8 తర్వాత వారు అలసి, భోజనం చేసి పడుకోవడం, వారి తల్లిదండ్రులకు చాలా సంతోషాన్నిస్తుంది. ఏదో మధ్యల ఒక్కరోజు సెలవు వస్తే వారిపిల్లలు చేసే అల్లరిని తట్టుకోలేక, మళ్ళీ పాఠశాల ఎప్పుడు ప్రారంభమవుతుందా? అని వేచి చూస్తారనడంలో వాస్తవం లేదా? ఒకరిద్దరు పిల్లలను సముదాయించలేని తల్లిదండ్రులు అలా ఆలోచిస్తే, రోజంతా వందల మంది విద్యార్థులతో సతమతమయ్యే ఉపాధ్యాయుల గురించి ఆలోచించేవారు లేరిప్పుడు. తమ పిల్లలకు ఎలాంటి క్రమశిక్షణ ఉంది, ఎలాంటి జ్ఞానం సంపాదించారో కూడా తెలుసుకోవడానికి ప్రయత్నించరు. ఓపికున్నా తల్లిదండ్రులు ప్రయత్నిస్తే మరుసటి రోజు పాఠశాలకు రావడం, యాజమాన్యంతో మాట్లాడటం, సంబంధిత ఉపాధ్యాయులను పిలవడం, వారిముందే మందలించడం సర్వసాధారణమైపోయింది. ఆత్మాభిమానం చంపుకుంటూ, వీటన్నింటిని భరిస్తూ పనిచేస్తున్న సిబ్బందికి అడ్మిషన్ టార్గెట్స్ అనేవి మానసిక ఆందోళనలకు గురిచేస్తున్నాయి. అలాగే విద్యార్థుల నుండి 12 నెలల ఫీజును వసూలు చేసి అందులో పనిచేసే సిబ్బందికి మాత్రం 10 నెలల జీతాలివ్వలేని యాజమాన్యాల తీరు దేనికి నిదర్శనమో సమాజమే తెలియజేయాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయాల పట్ల చొరవ చూపి, ఉపాధ్యాయులకు కనీస వేతనాలనిప్పిచ్చేవిధంగా, వారి ఆత్మాభిమానాన్ని కాపాడే విధంగా, వారికి ఎలాంటి మానసిక ఆందోళన కగిలించకుండా, ఉద్యోగ భద్రత కల్పించే విధంగా చర్యలు తీసుకోవడంలో భాగంగా ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి, ప్రభుత్వమే జీతాలను నిర్ణయించి, ప్రైవేటు యాజమాన్యం వద్ద వసూలుచేసి, నేరుగా ఉద్యోగుల ఖాతాలోకి జమ చేయడం, వారికీ పీఎఫ్, ఈఎస్ఐ వచ్చే విధంగా చర్యలు తీసుకోవడానికి ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. పాఠశాలలో జరిగే ప్రతి విషయం, ప్రభుత్వ పాఠశాలల వలే ప్రభుత్వానికి తెలియజేసే విధంగా చర్యలు తీసుకుంటూ, ఇప్పుడున్న నిరుద్యోగ సమస్యకు ఏదో ఒక పరిష్కార మార్గం చూపకపోతే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కావున దానికి తగినట్టుగా మేధావులతో ఆలోచించి శాశ్వత పరిష్కారం వైపు అడుగులు వేయడానికి ప్రయత్నించాలి. సమాజంలో ఉన్న మేధావులు, రచయితలు, ప్రత్యేకంగా విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఈ సమస్యను అర్థం చేసుకొని ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఉన్నది. విద్యా వ్యవస్థలో మార్పులు రావాలని, ప్రైవేట్ ఉపాధ్యాయుల కష్టాలు తీరాలని ఆశిద్దాం.

సెల్ : 9441930361